నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

శనివారం | జులై 27, 2024 | www.navatelangana.com

పొంచి ఉన్న ప్రమాదం



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని ముత్యంపేట గ్రామం ఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపంలో ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మంచిర్యాల నిర్మల్ ప్రధాన రహదారిపై చెట్టు రోడ్డుపై ఒరిగి ప్రమాదకర స్థితిలో ఉంది. ఇదే రహదారిపై నిత్యం వాహనాలు స్థానిక గ్రామస్తులు ప్రయాణిస్తూ ఉంటారు. పూర్తిగా ఒరిగిన చెట్టు తమపై పడుతుందేమోనని వాహనదారులు, స్థానికులు భయం భయంగా అటువైపుగా వెళ్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకముందే రోడ్డుపై పూర్తిగా ఒరిగిన చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యాసంస్థలకు స్థలాలు కేటాయించండి

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించే విధంగా కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ కోరారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు సల్వాజి మహేందర్‌రావు, గట్టు మురళీధర్ రావు, సూరం రవీందర్‌రెడ్డితో కలిసి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరారు. మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలకు వెంటనే స్థలం కేటాయించాలని తెలిపారు. స్థానిక జ్యోతిబాపూలే అద్దె భవనాల్లో నడుస్తుందని తెలిపారు. అరకొర వసతుల నడుమ జ్యోతిబాపూలే విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు.

మార్కెట్ కమిటీ గోదాం అభివృద్ధికి కృషి

- మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ గోదాంను అభివృద్ధి చేసేల కృషి చేస్తానని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య అన్నారు. శుక్రవారం మొదటిసారి మండల కేంద్రానికి మార్కెట్ కమిటీ చైర్మన్ వచ్చిన సందర్భంగా స శాలువాతో సన్మానించారు. అనంతరం మార్కెట్ గోదాంలను పరిశీలించి మాట్లాడుతూ నియోజకవర్గంలోని వ్యవసాయ గోదాంల తనిఖీల్లో భాగంగా బెజ్జూరు వ్యవసాయ గొదాం వద్దకు రావడం జరిగిందన్నారు. వ్యవసాయ గొదాం ప్రధాన ద్వారం గేటు, వాహనాలు నడుపుటకు గోదాం పరిసరాల్లో సీసీ, గోదా వెనకాల కూలిపోయిన కాంపౌండ్ వాల్, గోదాంలోని చిన్నచిన్న మరమ్మత్తులకు ప్రణాళికలు సిద్ధం చేయలని అధికారులకు తెలియడం జరిగిందన్నారు. త్వరలో నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ గోదాంలో ఉన్న మరమత్తు పనులపై చర్చించి నిధులు సమీకరించి గోదాం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ సంజీవ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజారాం కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూస శంకర్ యాదవ్, ఉపాధ్యక్షులు భుజాడి బాబాజీ, యువజన అధ్యక్షులు అబ్దుల్ హకీం, నాయకులు తెలంగాణ జావిద్, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ సిబ్బంది పవన్ ఉన్నారు.

పనులు యుద్ధ ప్రాతిపధికన పూర్తి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో గుర్తించిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపధికన పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, అభివృద్ధి మరమ్మత్తు పనులు పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కమిటీల ద్వార సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రతి పాఠశాలలో తాగు నీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు తరగతి గదుల ఏర్పాటు, అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన కొనసాగాలని సూచించారు. వర్షాకాలం అయినందున విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చూడాలని గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బావిలో పడ్డ నక్కను కాపాడిన అటవీ అధికారులు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని బంగారు తండా గ్రామ శివారు వాగు సమీపంలో ఉన్న బావిలో పడ్డ నక్కను గురువారం అటవీ అధికారులు కాపాడారు. నక్క పొలంలో ఉన్న బావిలో పడిపోయింది. గమనించిన గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన బేస్ క్యాంప్ సిబ్బంది రాజేశ్వర్, ఎఫ్ఎస్ఓ కృష్ణరావులు గ్రామస్తుల సాయంతో, ఆ బావిలో పడ్డ నక్కను బయటికి తీసి, అడవిలోకి వదిలిపెట్టారు.

కట్నం వేధింపులో భర్తకు జైలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అదనపు కట్నం విషయంలో భార్యను వేధించిన కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు, రూ.2వేల జరిమానాను విధిస్తూ ఆదిలాబాద్ ఫస్ట్ క్లాస్ న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2017 మార్చి నెలలో ఓ బాధితురాలు భర్త కట్నం విషయంలో వేధిస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు తలమడుగు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసులో ఏడుగురు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ నేపథ్యంలో తలమడుగు మండలం సుంకిడి గ్రామానికి చెందిన నిందితుడు లచ్చన్నకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి దుర్గారాణి తీర్పును వెలువరించినట్లు పేర్కొన్నారు.

కమ్యూనిటీ పోలిసింగ్‌తో సేవలు మరింత చేరువ



నవతెలంగాణ-జైపూర్

పోలీస్ కమీషనరేట్ పరిధిలో చేపట్టిన కమ్యూనిటీ పోలీసింగ్‌తో శాఖ పరమైన సేవలు మరింత చేరువయ్యాయని మంచిర్యాల జిల్లా షీటీమ్ ఎస్ఐ హైమ అన్నారు. శుక్రవారం భీమారం మండల కేంద్రంలోని కస్తూరిభా పాఠశాల విద్యార్థులకు మహిళలు, పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాలు, తీసుకోవల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో మహిళల, పిల్లల రక్షణ భద్రత కోసం షీ టీమ్స్ భరోసా సెంటర్లు పని చేస్తున్నాయని తెలిపారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, గుడ్, బ్యాడ్ టచ్, టీ సేఫ్ ఆప్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, వరకట్నం చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లలు మహిళలను ఇబ్బందులకు గురి చేసే వారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సైబర్ నేరాలపై సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేయాలని తెలిపారు. బాలికలను ఎవరైనా వేదిస్తే రామగుండం షీ టీమ్ నంబర్ 6303923700కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ సిబ్బంది మహిళా కానిస్టేబుల్ జ్యోతి, కానిస్టేబుల్ సతీష్ కేజీబీవి ఎస్ఓ ఫణిబాల, సిబ్బంది పాల్గొన్నారు.

29న సింగరేణి రక్షణకు సీపీఐ(ఎం) బస్సు యాత్ర

- హాజరు కానున్న రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



రౌండ్ టేబుల్ సమావేశంలో నినాదాలు చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

నవతెలంగాణ-మంచిర్యాల

సింగరేణి బొగ్గు బావుల పరిరక్షణకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జూలై 29 నుంచి బెల్లంపల్లి నుంచి బస్సు యాత్రను పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని చార్వాక హాల్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆశయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా బొగ్గు గనుల వేలం వేస్తోందని, దేశ సహజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించబోతుందని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణ పల్లి బొగ్గు బ్లాకు కూడా వేలంలో పెట్టిందని, సింగరేణిని కూడా ప్రయివేటు సంస్థలతో పోటీ పడేలా చేయల్సింది పోయి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు చూస్తోందని విమర్శించారు. బీజేపీ విధానాలను భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. తెలంగాణలో బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించి, బొగ్గు గనుల వేలం ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను జూలై 29 నుంచి ఆగస్టు 5 వరకు నిర్వహిస్తున్నామన్నారు. బొగ్గు బ్లాకుల ప్రయివేటు సంస్థలకు అప్పజెప్తే రానున్న కాలంలో సింగరేణి బలహీనపడి మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని దీంతో సింగరేణి ప్రాంత ప్రజలకు, తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. సింగరేణి గనులు తెలంగాణలో కొంగు బంగారం, కార్మికుల కష్టంతో సిరులు కురిపిస్తుందని, 76 వేల మంది పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు నిరంతరం సింగరేణిలో కష్టపడుతున్నారన్నారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చౌక ధరకే బొగ్గు సరఫరా చేస్తూ తక్కువ ఖర్చుతో కరెంట్ ఉత్పత్తికి తోడ్పడుతున్నదని, ఫలితంగా ప్రజలకు విద్యుత్ భారం తగ్గిస్తున్నదని అన్నారు. సింగరేణి జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల్లో విద్య, వైద్యం, రోడ్లు, మంచినీరు, ఇతర మౌలిక సదుపాయాలకు నిధులు ఖర్చు పెడుతోందని బంగారు గుడ్లు పెడుతున్న బాతు లాంటి సింగరేణిని కార్పొరేట్లకు నైవేద్యం పెట్టాలని చూస్తున్న మోడీ రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల సమయంలో బీజేపీ 8 మంది ఎంపీలు, 8 మంది శాసనసభ్యులను గెలిపించారని గుర్తు చేశారు. తెలంగాణ నుంచి గెలుపొంది బొగ్గు గనుల శాఖ మంత్రిగా నియమితులైన కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా బొగ్గు బ్లాకుల వేలంపాట ప్రారంభించడం సిగ్గుచేటు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కేంద్రంతో పోరాడకుండా, సింగరేణికి గనులు దక్కకుండా చేసిందని తెలిపారు. ఇప్పటికే కోయగూడెం బ్లాక్ 3, సత్తుపల్లి బ్లాక్ 3 గనులను ప్రయివేటు కంపెనీలు దక్కించుకున్నాయని తెలిపారు. ఇప్పటికైనా తెలంగాణ బిడ్డలకు అన్యాయం జరగకుండా ఉండాలంటే శ్రావణపల్లి బొగ్గు బ్లాకు ను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను కాపాడే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని లేని యెడల రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందన్నారు. అందుకోసం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సింగరేణి వ్యాప్తంగా సింగరేణి పరిరక్షణ యాత్ర పేరిట బస్సు యాత్ర చేపట్టిందని ఈ యాత్రలో వామపక్ష పార్టీలు, ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, సామాజిక సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో దుర్గం సిద్ధార్థ, రాంమూర్తి, సమత సైనిక్ దల్ రాష్ట్ర నాయకులు, జాడి దేవరాజ్ సీపీఐ(ఎం ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి. కామిల్ల జయరావ్ ఐఆర్పిపి రాష్ట్ర నాయకులు ముడిమడుగుల బ్రహ్మయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాతిపెల్లి నగేష్, జిల్లా నాయకులు రంగు రాజేశం ఉద్యోగ సంఘాల నాయకులు, చందు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాల దగ్ధం



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిగంబర్, నవీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర వసతి గృహంలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.3 శాతం కేటాయించిందని, ఇది గత ఓటాన్ బడ్జెట్లో కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువ ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టినట్లు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పిందని, కానీ దాని ఊసు ఈ బడ్జెట్లో లేదన్నారు. ప్రతి రెండు గ్రామాలకు ఒక గురుకులమని, యూనివర్సిటీల అభివృద్ధి కోసం కేవలం రూ.500 కోట్లు కేటాయించారన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో యూనివర్శిటీలు దెబ్బతిన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చి బడ్జెట్లో కేటాయింపులు లేవన్నారు. ఈ ప్రభుత్వం గత ప్రభుత్వంలా కాకుండా 15 శాతం పైగా నిధులు విద్యారంగానికి కేటాయిస్తామని హామీ ఇచ్చి 7.3 శాతం నిధులు మాత్రమే కేటాయించారని విమర్శించారు. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి నిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, కార్తీక్, కిరణ్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్మికుల నిరసన

నవతెలంగాణ-కాగజ్‌నగర్



బకాయి పడ్డ వేతనాల చెల్లింపు, పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు గురువారం నుండే సమ్మె చేపడుతుండగా రెండో రోజైన శుక్రవారం స్థానిక రాజీవ్ చౌరస్తాలో కార్మికులు బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కార్మిక యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, సంజీవ్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా ఎన్ఎంఆర్ కార్మికులకు, మూడు నెలలుగా కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. రూ. 2 కోట్ల వరకు పీఎఫ్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇటీవల ఇద్దరు కార్మికులు చనిపోతే వారికి ఇప్పటి వరకు నయా పైసా కూడా చెల్లించలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని, పాలకవర్గాన్ని నిలదీస్తే తమను పనిలో నుండి తొలగిస్తామని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్, నాయకులు మల్లేష్, రమేష్, మధు, శేఖర్, భూమయ్య సుధాకర్, తిరుపతి, శంకరమ్మ, శ్యామల పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి రామారావుపేట్ గ్రామ పంచాయతీ దుబ్బపల్లికి చెందిన జాడి హరీష్(28) గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి భోజనం ముగించుకుని తన రూమ్‌లో నిద్రిస్తున్న హరీష్ శుక్రవారం తెల్లవారు జామున ఉరి వేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్ కొనుగోలుకు అప్పులు చేసిన హరీస్ తన చెల్లెలి వావాహం కొసం మరింత అప్పు చేశాడు. సుమారుగా రూ.12 లక్షలు అప్పు చేసిన హరీష్ కనీసం ట్రాక్టర్ నెలసరి ఫైనాన్స్ చెల్లించలేని పరిస్థితుల్లో అప్పుల ఒత్తిడి పెరిగింది. దీనికి తోడు శ్రీరాంపూర్ ఓసీ విస్తరణలో దుబ్బపల్లి ముంపుకు గురవుతున్నందున సింగరేణి సంస్థ చెల్లించనున్న నష్టపరిహారంతో అప్పులు చెల్లించాలని భావించిన హరీష్ సకాలంలో సంస్థ నుండి పరిహారం అందక మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థుల ద్వార సమాచారం అందుకున్న స్థానిక అదనపు ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతుని తండ్రి జాడి బొంద్యాలు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నా చావుకు కారకులు సింగరేణి యాజమాన్యం

గురువారం రాత్రి దుబ్బపల్లిలో ఆత్మహత్యకు పాల్పడిన జాడి హరీష్(28) రాసుకున్న సూసైడ్ నోట్‌లో తన చావుకి సింగరేణి యాజమాన్యం, గ్రామ పెద్దలు కారకులని పేర్కొన్నాడు. ముఖ్యంగా ఇలాంటి చావులు మరిన్ని చూడవద్దని పేర్కొంటూ జన్మనిచ్చిన తల్లితండ్రులను గుర్తు చేసుకున్నాడు. తోడబుట్టిన అక్క, చెల్లి నన్ను క్షమించండి. అమ్మనాన్నలను మీరే చూసుకోవాలని సూసైడ్ నోట్ పేర్కొన్నాడు.

రూ.10 వేల ఆర్థిక సాయం

గురువారం రాత్రి దుబ్బపల్లిలో ఆత్మహత్య చేసుకున్న జాడి హరీష్ కుటుంబానికి సింగరేణి యాజమాన్యం తరపున శ్రీరాంపూర్ ఏరియా జీఎం రూ.10 ఆర్థిక సాయం అందించారు. శ్రీరాంపూర్ ఓసీ ముంపులోకి వస్తున్న దుబ్బపల్లిలో సర్వే పూర్తి చేసిన యాజమాన్యం బాధితులకు పరిహారం పంపిణీ చేయడంలో తాత్సారం చేస్తున్నారన్న అభిప్రాయపడిన హరీష్ తన చావుకు సింగరేణి యాజమాన్యం కూడ కారణమని చెప్పిన క్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడిన జీఎం హరీష్ అంతిమ సంస్కారాల కోసం ఆర్థికంగా సహకరించినట్లు తాజామాజీ సర్పంచ్ నామల సత్యవతి తిరుపతి తెలిపారు..

అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి



నవతెలంగాణ-నిర్మల్

అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమం, వైద్యారోగ్యశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలన్నారు. రక్తహీనత నియంత్రణకు ప్రతి చిన్నారికి, గర్భిణికి బాలామృతం, పోషకహారం అందించాలని సూచించారు. ప్రతీ చిన్నారిని కేంద్రంలో చేర్పించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా డైట్ చార్టులను ఉంచడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కేంద్రాల్లో చిన్నారులను ఆకట్టుకునేలా పెయింటింగ్స్, బొమ్మలు, ఇతర ఆట వస్తువులను అందుబాటులో ఉంచాలన్నారు. సూపర్‌వైజర్లు నిరంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తూ చిన్నారుల హాజరు, మెనూ వివరాలను పరిశీలించి సంబంధిత రిపోర్టులను పంపించాలన్నారు. ప్రతి కేంద్రంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కను జియో ట్యాగింగ్ చేసి నివేదికలను అందజేయాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మాహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి నాగమణి, డీఎంహెచ్ఓ డా.ధన్‌రాజ్, సీడీపీఓలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒలంపిక్‌లో దేశ కీర్తిని చాటాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పారిస్‌లో శుక్రవారం నుంచి జరగనున్న ఒలంపిక్స్‌లో పాల్గొంటున్న 117 మంది భారతీయ క్రీడాకారులు దేశ కీర్తిని చాటాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడ పాఠశాలలో భారతదేశ పతాకాలతో క్రీడా స్ఫూర్తిని నింపేలా చీర్ ఫర్ ఇండియా నినాదంతో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒలంపిక్స్ క్రీడల్లో అత్యధిక పథకాలు సాధించి భారత దేశ కీర్తి పతాకాన్ని దశదిశలు చాటాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో గిరిజన క్రీడ పాఠశాల నుండి విద్యార్థినులు ఒలంపిక్స్ వరకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓ క్షేత్రయ్య, జీసీడీఓ శకుంతల, క్రీడల అధికారి బండ మీనా రెడ్డి, సీనియర్ హెచ్ఎం సుధాకర్, క్రీడా పాఠశాల హెచ్ఎం కృష్ణారావు, కోచ్ విద్యాసాగర్, విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



నవతెలంగాణ-హాజీపూర్

వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హన్మకొండలోని వరంగల్ క్లబ్‌లో జులై 23 నుంచి 26 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అండర్-17 మిక్స్ డబుల్ విభాగంలో మంచిర్యాల క్రీడాకారుడు ఆదిత్య హర్షవర్ధన్ రంగారెడ్డి జిల్లా క్రీడాకారిణి రిషిత పాండేతో కలిసి మిక్స్ డబుల్స్‌లో ఫైనల్‌కు చేరుకొన్నారు. ఫైనల్లో శౌర్య కిరణ్, కీర్తి మంచాల జనగాం క్రీడాకారులపై గెలుపొంది చాంపియన్స్ గా నిల్చారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరు సుధాకర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా చేతుల మీదుగా ఆదిత్య హర్షవర్ధన్ ట్రోఫీ అందుకున్నారు. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మిక్స్ డబుల్ విభాగంలో మొదటి స్థానం సాధించిన ఆదిత్య హర్షవర్ధన్‌ను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, ఉపాధ్యక్షులు భాస్కర్ల వాసు, బండ మీనారెడ్డి, ట్రెజరర్ సత్యపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేష్‌రెడ్డి, మధు, కార్యవర్గ సభ్యులు కృష్ణ, రాజలింగు, లక్ష్మీనారాయణ, హర్ష నరేందర్, అవిన్ బాబు అభినందించారు.

పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలి

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో గ్రామ పంచాయతీల వారిగా పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలని భీమారం ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్ సూచించారు. శుక్రవారం ఖాజీపల్లి గ్రామాన్ని సంధర్శించిన ఆయన వార్డుల్లో పర్యటిస్తూ పారిశుధ్య పనుల నిర్వాహణను పరిశీలించారు. అదేవిధంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సంధర్శించి రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులకు అందించే పౌష్టికారం, పరిసరాల పరిశుభ్రత, అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వలు పరిశీలించారు. అదేవిధంగా భీమారం-నెన్నల మండలాల మధ్యన కాజిపల్లి సమీపంలో వర్షాలతో కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలించారు.



పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని వార్డు కౌన్సిలర్ నాయిని ప్రవంతి సంతోష్ సూచించారు. శుక్రవారం ఆమె శ్రీరాంనగర్ కాలనీలో పలువురి నివాస గృహాలను సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో చెత్త కుప్పలు, మురుగు నీరు నిల్వ లేకుండా శ్రద్ధ వహించాలని అన్నారు. అపరిశుభ్రత వల్ల ఈగలు, దోమల ఉధృతి పెరిగి వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ చంద్రాణి, వార్డ్ నిర్వాహణ అధికారి శ్రీనివాస్, ఆర్పీ రాజలింగం, ఆశా కార్యకర్త గుమ్ముల భారతి పాల్గొన్నారు.



వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారనీ శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి పూర్తిస్థాయిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ బడుగు వర్గాల, మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. గత ప్రభుత్వం బడ్జెట్ కంటే కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమం ప్రాతిపదికన రూపొందించిందని అన్నారు. మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఖయ్యూమ్, ఎస్పీ రెడ్డి, చంద్రయ్య, ఇక్బల్, నాయకులు కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.



ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి, సబ్ సెంటర్‌ను శుక్రవారం ట్రైనీ కలెక్టర్ అభీగ్యాన్ మాలవియ సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించి, గర్భిణీ బాలింతలకు రోగులకు అందుతున్న వైద్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు, వైద్య సిబ్బంది నాందేవ్, చౌహాన్ చరణ్‌దాస్, లక్ష్మీ, సుశీల, రాజమ్మ ఉన్నారు.

డిగ్రీ కళాశాల కోసం భవనం పరిశీలన



నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రానికి నూతనంగా డిగ్రీ కళాశాల మంజూరు అయ్యింది. త్వరలో తరగతులు సైతం ప్రారంభం కానున్నాయి. దీంతో తాత్కాలికంగా నూతన డిగ్రీ కళాశాల కోసం స్థానిక గిరిజన గురుకుల పాఠశాల చెందిన పాత భవనాన్ని శుక్రవారం రోజు తహసీల్దార్ శ్రీకాంత్, డీటీడబ్ల్యూఓ అంబాజీ, పరిశీలించారు. భవనంలో ఉన్న వసతులను పరిశీలించి, పలు వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్టు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని బోరిగాం గ్రామపంచాయతీ కార్యదర్శి ఆనంద్ రావు బదిలీ కావడంతో శుక్రవారం మాజీ సర్పంచ్ అమృత మురళి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామంలో ఐదు సంవత్సరాలు కార్యదర్శిగా పనిచేసి, ప్రజల మన్ననలు పొందటం అభినందనీయమని అన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శి పద్మాజను సన్మానించి, అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్, పాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశ్రమ బాలికల పాఠశాలలో వైద్యశిబిరం

● డా.సర్ఫరాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో చిచ్‌ధరి, ఖానాపూర్‌లోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో డా.సర్ఫరాజ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు 63 మంది విద్యార్థినిలకు పరీక్షలు నిర్వహించి, 14 మంది రక్త నమూనాలు సేకరించామని అన్నారు. అలాగే గ్రామంలో నలుగురు గర్భిణీలకు పరీక్షించి, రక్తపరీక్షలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, కొడప యశోద, మర్సకోల లక్ష్మిబాయి ఎంఎల్‌హెచ్‌పీ ఆకాంక్ష, ల్యాబ్ టెక్నిషన్ శ్రీనివాస్, మడావి, ఆరోగ్యసహాయకులు రాథోడ్ నారాయణ, పవార్ శైలజ, ఆశకార్యకర్త చంగున, సుమిత్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ కుమార్, వార్డెన్ ప్రకాష్, ఏఎన్ఎం ఆర్.సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈనెల 30న నిరుద్యోగ యువకులకు జాబ్ మేళ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రయివేటు రంగంలో ఉద్యోగాలను కల్పించుటకు ఈ నెల 30న పట్టణంలోని సాత్నాల క్వార్టర్స్ వద్దనున్న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళ నిర్వహిస్తున్నట్టు ఉపాధి కల్పన అధికారి మిల్కా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయివేటు కంపెనీలో గల ఉద్యోగాల ఎంపిక జరుగుతుందని ఎంపిక అయిన వారికి రూ.14వేలకు పైగా వేతనంతో పాటు ఇతర అలవెన్సులు ఇవ్వబడతాయని పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాల నుంచి 37 సంవత్సరాలోపు పురుషులు అర్హులని పేర్కొన్నారు. అర్హత ఆసక్తి గల జిల్లా నిరుద్యోగ యువకులు తమ బయోడేటా విద్యార్హతల సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కార్యాలయం మంగళవారం ఉదయం 10.30 కు జరిగే మేళకు హాజరు కావాలని పేర్కొన్నారు. నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9494305417, 9177616132 నెంబరులను సంప్రదించాలని సూచించారు.

గోపాల్‌పూర్‌లో విజృంభిస్తున్న జ్వరాలు

● ఆర్ఎంపీల వద్ద చికిత్సలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గత వారం రోజులుగా కురుస్తున్న ఏకధాటి వర్షాలతో గ్రామాల్లో తాగునీరు కలుషితం కావటంతో పల్లెల్లో వైరల్, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. మండలంలోని పిట్టబొంగరం పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల గ్రామమైన గోపాల్‌పూర్‌లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆ గ్రామానికి వైద్యసిబ్బంది రాకా పోవడంతో జ్వరాలతో బాధపడుతున్న సుమారు 15 నుంచి 20 మంది ఉన్నారు. మండల కేంద్రంలో ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించినట్టు గ్రామస్తుడు శంకర్ తెలిపారు. వీరిలో సుజాత (45) ఎల్మోలె, సట్ల కొండిబా (50), రఘునాథ్ ఎల్మోల, ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొందరు మండల కేంద్రంలోని వివిధ ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నట్టు తెలిపారు. సుమారు 60 ఇండ్లు ఉన్న ఆ గ్రామంలో ఇంటికి ఒకరిద్దరు మంచం పట్టారని, గ్రామస్తులు పేర్కొన్నారు. జ్వరాలతో విలవిల లాడుతున్న తమ గ్రామంలో వైద్యసిబ్బంది పర్యటించాలని, పిట్టబొంగరం పీహెచ్‌సీ సిబ్బందికి సమాచారం ఇచ్చినా స్పందించలేదని గ్రామస్తుడు శంకర్ తెలిపారు. ఇక చేసేదేమీ లేక శుక్రవారం నాడు వర్షం కాస్త తగ్గడంతో ఇరవై కి.మీ.దూరంలోని మండల కేంద్రానికి తరలించి, ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పదించి తమ గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో డ్రై డే సందర్భంగా పలు కాలనీలో తిరుగుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని కోరుతూ ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులను మొదట్లోనే అరికట్టాలని అన్నారు. అంటే దోమల నివారణ అత్యంత ప్రదానం అన్నారు. దోమలు అనేక రకాల వ్యాధులకు కారణం అవుతున్నాయని అన్నారు. వీటి వల్ల ప్రధానంగా డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వ్యాధులన్నీ దాదాపుగా ఒకేరకంగా ఒకే లక్షణాలతో ఉంటాయని తెలిపారు. వ్యాధులకు కారణమైన వైరస్ వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుందన్నారు.



మురుగు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు మురుగు తొలిగించాలని అన్నారు. ప్రతి ఇంటి వద్ద నీటి కుండిలలో, కొబ్బరి చిప్పలో, కూలర్‌లలో టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డి, ముండ్ల పొదలు ఇంటి పరిసరాలల్లో ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్, డాక్టర్ కిరణ్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంత్, హెల్త్ అసిస్టెంట్ కైలాస్, ఈఓ సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-తాంసి

విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ దాసరి గంగారాం విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. మొదటగా జ్యోతి ప్రజ్వల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తమ కుటుంబ సభ్యులు వ్యవసాయానికి అవసరమయ్యే సీడ్స్ పెస్టిసైడ్ కొనేటప్పుడు బిల్ తీసుకోవాలని అన్నారు. నకిలీ విత్తనాలు ఎరువులు వల్ల నష్టం జరుగుతే కంపెనీపై దుకాణాలపై కన్జ్యూమర్ ఫోరంలో కేసు వేయవచ్చని అన్నారు. వ్యవసాయ కూలీలు ఇన్సూరెన్స్ చేసుకోవాలని, లేబర్ ఆఫీసులో సభ్యత్వం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఒక సారి కేసుల్లో ఇరుక్కుంటే ఏటువంటి ఉద్యోగానికి పనికి రారని అన్నారు. నిరుపేద వారు కేసుల్లో ఉంటే జిల్లా లీగల్ అథారిటీ అడ్వకేట్ ఉచితంగా మీ కేసులు వాదిస్తారు. పిల్లలు ఫోన్‌లు వాడొద్దని, అపరిచిత వ్యక్తులు మిపట్ల అనుచితంగా వ్యవహరించిన వెంటనే పోలీస్ స్టేషన్ సమాచారం ఇవ్వాలని అన్నారు. అనంతరం కార్గిల్ అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ అరుగుల అశోక్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉమేష్ డోలే, ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, తహసీల్దార్ లక్ష్మి, ఏఎస్సై స్వామి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఏజెన్సీ దళిత రైతులకు రుణమాఫీ చేయాలి

● జెడ్పీ మాజీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్

నవతెలంగాణ-నార్నూర్

ఏజెన్సీ గ్రామాల్లో తరతరాలుగా నివసిస్తున్న దళిత రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయాలని, జెడ్పీ మాజీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల నాయకుల ఆధ్వర్యంలో రైతులతో కలిసి రోడ్డు పై ధర్నా చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను త్వరగా అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ముందుగా గాంధీచౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. ఏజెన్సీ గ్రామాల్లో తరతరాలుగా నివసిస్తున్న దళిత రైతులకు రుణమాఫీ చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల మండల అధ్యక్షుడు రూపదేవ్, తుడందెబ్బ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, మాజీ సర్పంచ్ విష్ణు, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖాసీం, రాథోడ్ సుభాష్, రాథోడ్ శివాజీ, ఫిరోజ్ రైతులు ఉన్నారు.



కురుస్తున్న వర్షాలు... అధ్వానంగా మారిన రోడ్లు...

నవతెలంగాణ-లోకేశ్వరం

ఎడతెరిపి లేకుండా వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో మండలంలోని రోడ్లు మొత్తం అధ్వానంగా మారాయి. మండల కేంద్రంలోని మన్మధ్ గ్రామం నుంచి హవర్గా ఎక్స్ రోడ్డు వరకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, వర్షాలకు నీరు ఆ గుంతల్లో చేరడంతో దాదాపు 5 కిలోమీటర్ల రోడ్డు మొత్తం చెరువును తలపిస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ఆ రోడ్డు గుండా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. తరుచూ వాహనాలు మరమ్మతులు చేయించాల్సి వస్తుందని అన్నారు. ఇలా ఆర్థికంగా నష్టపోవడంతో పాటు అనారోగ్యాల బారిన పడుతున్నామని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని విట్టోలి గ్రామానికి చెందిన గంగాసాగరకు శుక్రవారం తెల్లవారుజామున పురిటినొప్పులు రావడంతో 108 సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది గంగాసాగరను ఆస్పత్రికి తరలించే క్రమంలో తరోడా గ్రామ సమీపంలో అంబులెన్స్‌లో సుఖప్రసవం జరిగి 3వ కాన్పులో పండంటి ఆడ బిడ్డను జన్మనిచ్చింది. తల్లిబిడ్డలు సురక్షితంగా ఉన్నట్టు సిబ్బంది ఈఎంటి పండరి, పైలట్ నస్రూల్లాఖాన్, తెలిపారు. చికిత్స కోసం భైంసా ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బందికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన ప్రిన్సిపాల్‌కు సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల, కళాశాలకు నూతనంగా వచ్చిన ప్రిన్సిపల్ ఆంజనేయులును శుక్రవారం మాజీ సర్పంచ్ బానోథ్ గజానంద్ నాయక్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపల్ ఉపేందర్‌ను శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. కళాశాల ప్రిన్సిపల్‌గా ఉపేందర్ చేసిన సేవలకు కొనియాడారు. సన్మాన కార్యక్రమంలో ప్యాక్స్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, ఉత్తం రాథోడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు లోఖండే దేవరావ్, దస్తగిరి, దాదేఅలీ, మహేందర్, వసంత్ ఆడే, సుల్తాన్‌ఖాన్, దిగంబర్ ఆడే, దిలీప్ రాథోడ్, మహేందర్, సయ్యద్ ఖాసిం, విష్ణు, నసీర్, గోవింద్, అరవింద్, షేక్ అహ్మద్, సుభాష్, ఆడే విలాస్, మోహన్, భారత్ శంకర్, కళాశాల సిబ్బంది ఉన్నారు.

నిలిచిన నీటితో రాకపోకలకు ఇబ్బందులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో మహాలక్ష్మీవాడ సమీపంలోని రైల్వే వంతెన కింద వర్షపు నీరు భారీగా నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కౌన్సిలర్లు సంద నర్సింగ్, పందిరి భూమన్న అన్నారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షం పడిన ప్రతీసారి వంతెన కింద నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. కమిషనర్ స్పందిస్తూ సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మహాలక్ష్మి ఆలయంలో బోనాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆషాఢమాసం పురస్కరించుకుని భక్తులు బోనాలు సమర్పించేందుకు ఆలయాలకు పోటెత్తుతున్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన మహాలక్ష్మివాడాలో గల మహాలక్ష్మి ఆలయంలో బోనాలను సమర్పించారు. శుక్రవారం కావడంతో ఉదయం నుండే భక్తులు ఆలయానికి పోటెత్తారు. కాగా మహాలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసి, సౌకర్యాలు కల్పించారు. భక్తులు బోనాలు సమర్పించి, తమ కోర్కెలు కోరుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి వంటలు వండాలని ఆరోగ్యంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు బండారి వంశీ, ప్రవీణ్, నవీన్, ఆకాష్, అభి, ఆశక్క ఉన్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-భైంసా

తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ముధోల్ నియోజకవర్గంలో శాంతిభద్రతల అంశంపై కాసేపు చర్చించారు. అక్కడి పోలీసు యంత్రాంగానికి కావాల్సిన సౌకర్యాలను వివరించారు. శాంతి భద్రతలకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలియజేశారు. అదేవిధంగా పలు అంశాలపై చర్చించారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టాక మొట్టమొదటిసారి కలువడంతో అభినందనలు తెలిపారు.

గాదిగూడ ఎంపీడీఓగా ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా గాదిగూడ ఎంపీడీఓగా ఎం.శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పలు రికార్డులు పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు సన్మానం చేశారు. వారి వెంట ఈజీఎస్ ఏపీఓ పవార్ నితిన్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-భైంసా

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని భైంసా ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఫ్రైడే, డ్రైడే సందర్భంగా మండలంలోని హజ్గుల్ గ్రామంలోని మురుగు కాలువలను పరిశీలించారు. చెత్తను వెనువెంటనే తీసేయాలని అన్నారు. ఎంపీడీఓ వెంట హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | జులై 27, 2024 | www.navatelangana.com

ట్రాన్స్ జెండర్లు పథకాలు ఉపయోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ట్రాన్స్ జెండర్ల సంక్షేమం కోసం ఆర్థిక పునరావాస పథకం అమలు చేయడం జరుగుతుందని దీనిని ఉపయోగించుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్‌తో కలిసి ఇద్దరు ట్రాన్స్ జెండర్లకు 2022-23 సంవత్సర ఆర్థిక పునరావాస పథకం క్రింద చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ల సంక్షేమం కోసం అర్హత గల వారికి గుర్తింపు కార్డులు అందించడం జరుగుతుందని, ఈ క్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక పునరావాస పథకం కింద జిల్లాలోని ఇద్దరు ట్రాన్స్ జెండర్‌లకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులు అందించడం జరిగిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రవి కుమార్, ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు.

ఇంటి గోడ కూలి మహిళ మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణం సర్‌సిల్క్‌లోని గంగారాంబస్తీకి చెందిన తాండ్ర కొమురమ్మ (58) శుక్రవారం మధ్యాహ్నం ఇంటి గోడ కూలి మృతి చెందింది. స్థానికులు తెలిపిన ప్రకారం వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా కొమురమ్మ ఇంటికి సంబంధించిన ఇటుక గోడ పూర్తిగా తడిసి శిథిలావస్థకు చేరుకుంది. మధ్యాహ్నం సమయంలో కొమురమ్మ గోడ పక్కనే ఉండగా, ఒకేసారి కూలి ఆమెపై పడింది. దీనితో కొమురమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మహిళకు భర్త లేడు. ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉండగా, వారు పనుల రీత్యా వివిధ ప్రాంతాలలో ఉంటున్నారు. ఇంట్లో ఒక్కతే ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

పదవీ కాలం ముగిసినా..ఎదురు చూపులేనా..?

- స్థానిక ప్రజా ప్రతినిధులకు అందని గౌరవ వేతనం
- ఆరు నెలలుగా ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీల అవస్థలు



స్థాయి సంఘాల సమావేశంలో జడ్పీ చైర్మెన్, స్థానిక సంఘాల ప్రజాప్రతినిధులు(ఫైల్)

నవతెలంగాణ-కెరమెరి

పదవీకాలం ముగిసినా ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనం అందడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 6 నెలలు గడుస్తున్నా ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీలు గౌరవ వేతనం అందుకోకుండానే పదవీకాలం ముగిసిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందు ప్రజాప్రతినిధులకు నామమాత్రపు వేతనాలు అందేవి. కేసీఆర్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజాప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని భావించారు. ఎంపీటీసీలకు నెలకు రూ.750 ఉన్న గౌరవ వేతనాన్ని రూ.5వేలు, ఎంపీపీలకు రూ.1500ల నుంచి రూ.10వేలు, జడ్పీటీసీలకు రూ.2,250ల నుంచి రూ.10 వేలకు పెంచారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ పెరిగిన నేపథ్యంలో మరోసారి వారి వేతనాలను 30 శాతం పెంచాలని కేసీఆర్ సంకల్పించి పెంచారు. దీంతో రూ.5 వేలు ఉన్న ఎంపీటీసీల గౌరవ వేతనం రూ.6500లకు, జడ్పీటీసీ, ఎంపీపీలకు రూ.5 వేలు ఉన్న గౌరవ వేతనాన్ని రూ.13 వేలకు కేసీఆర్ ప్రభుత్వం పెంచింది. అప్పటి వరకు రూ.7,500 గౌరవ వేతనం అందుకునే జడ్పీ చైర్మెన్లకు కూడా రూ.ఒక లక్షకు పెంచి అందరూ ప్రజాప్రతినిధులను గౌరవం కల్పించి వారికి వేతనాలను సకాలంలో అందించేవారు. సమైఖ్య పాలనలో నామమాత్రపు జీతానికి పరిమితమైన ప్రజాప్రతినిధులు కేసీఆర్ పాలనలో గౌరవ వేతనం ప్రకటించి వారి కష్టానికి తగినట్లు వేతనాలు అందిచడంపై ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం మారిన అందని వేతనాలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6నెలలైనా ప్రజాప్రతినిధులకు వేతనాలు రావడం లేదు. కాగా గౌరవ వేతనం పొందకుండానే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మెన్లు పదవీ నుంచి దిగిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు జరిగినప్పటి నుంచి ఒక్క రూపాయి కూడా గౌరవ వేతనం అందకపోవడంతో ప్రభుత్వంపై ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీలు గుర్రుగా ఉన్నారు. గత ప్రభుత్వం తమకు గౌరవ వేతనం అందించి, తగిన గుర్తింపును అందించిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ గౌరవ వేతనాలను నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగియడంతో ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు తమకు వస్తాయా..? రావా..? అనే సందిగ్ధంలో ఉన్నారు.

వినతిపత్రం అందించినా.. రానీ వేతనాలు

ఇటీవల ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఎంపీపీ, జడ్పీటీసీలు వినతిపత్రం అందించారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇప్పించాలని వేడుకున్నారు. అయిన గౌరవ వేతనం అందకపోవడంపై మాజీలు కాంగ్రెస్ సర్కారు పాలనపై అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 59 మంది జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు అందని వేతనం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు జడ్పీ చైర్మెన్‌లతో పాటు 59 మంది జడ్పీటీసీలు, 64 మంది ఎంపీపీలు, 507 మంది ఎంపీటీసీలకు గౌరవ వేతనం అందలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా వేతనాలు పొందిన జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆరు నెలలుగా గౌరవ వేతనాలు పొందలేదు. జూలై 4వ తేదీతో పదవీకాలం ముగిసి వీరంతా మాజీ ప్రజా ప్రతినిధులు అయినా నేటికి వేతనాల చెల్లింపుపై ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పదవీకాలం ముగిసినా గౌరవ వేతనం అందలేదు..



సయ్యద్ అబుల్ కలాం, ఎంపీటీసీ ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు

ఉమ్మడి జిల్లాలో అనేక మంది నిరుపేదలే ఎంపీటీసీలుగా ఎన్నికయ్యారు. ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎంపీటీసీల గౌరవ వేతనం చెల్లించేందుకు ముందుకు రాకపోవడం విడ్డూరం. కేసీఆర్ ప్రజామోద పాలనలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులందరికీ గౌరవం లభించింది. ఇక పనులు చేసిన వాటికి ఇంతవరకు బిల్లులు కూడా అందడం లేదు.

ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా..?



పెందూర్ మోతీరాం, మాజీ ఎంపీపీ కెరమెరి

ఆరు నెలలు గడిచినా తమకి ఇచ్చే గౌరవ వేతనం ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తుంది. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఏనాడూ జీతాలు ఆపలేదు. జీపీలకు నిధులు లేవు. సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించే సాహసం చేయడం లేదు. పరిపాలన స్తంభించింది. పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. గ్రామాలు కంపు కొడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. వెంటనే ఎంపీటీసీల గౌరవ వేతనం విడుదల చేయాలి. లేని పక్షంలో ఆందోళనలకు వెనుకాడేది లేదు.

ఆరు నెలల వేతనం రావాలి..



సిడ్మాకి ద్రుపత బాయి, మాజీ జడ్పీటీసీ కెరమెరి

గత సర్కారు ఎంపీటీసీకు గౌరవ వేతనం కింద నెలకు రూ.6,500 అందిస్తామని చెప్పడంతో కొత్తగా ఎన్నికైన తమకు సంతోషం అనిపించింది. అయితే గత ఐదేండ్లలో నెలనెల వేతనం ఇవ్వకున్నా.. ఒకేసారి రెండు, మూడు నెలలవి ఖాతాల్లో జమ చేస్తుండే. గత ఆరు నెలల నుంచి ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం ఇప్పటివరకు ఖాతాల్లో వేయడం లేదు. మా పదవీ కూడా అయిపోయింది. వెంటనే ఆ డబ్బులను మా ఖాతాల్లో జమ చేయాలి.

నిర్లక్ష్యం సరికాదు



జుమిడి సౌందర్య, మాజీ ఎంపీపీ రెబ్బెన

జిల్లాలో అనేక మంది ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైంది. మాజీ ప్రజా ప్రతినిధుల సమస్యలు పట్టించుకోవడం లేదు. గౌరవ వేతనాల సమస్యను పంచాయతీరాజ్ మంత్రి దృష్టికి పలువురు తీసుకెళ్లడం జరిగింది. అయిన స్పందన లేదు. గౌరవ వేతనాలు చెల్లింపులు ప్రభుత్వ నిర్లక్ష్యం సరైంది కాదు.

నలుగురిపై కేసు నమోదు



నవతెలంగాణ-రెబ్బెన

ఎలాంటి అనుమతులు లేకుండా ఎద్దులు, బర్రెలు తరలిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలం కాగజ్‌నగర్ క్రాస్ రోడ్ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో కౌటాల నుండి హైదరాబాద్ వెళుతున్న టీఎస్ 20టి2317 నెంబర్ గల ఐచర్ వ్యానులో 15 ఎద్దులు, 8 బర్రెలు అనుమతులు లేకుండా తీసుకు వెళుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్లు, నిర్వాహకులు, కూలీలు మొత్తం నలుగురిపైన కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహానికి మరమ్మతులు చేయాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోనిసాంఘిక సంక్షేమ వసతి గృహానికి మరమ్మతులు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. శుక్రవారం అధ్యయన యాత్రలో భాగంగా మండల కేంద్రంలోని సంక్షేమ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చినట్లు దుర్గం దినకర్ తెలిపారు. బీసీ, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు ఒకే చోటకొనసాగుతున్నాయని, నాలుగు గదుల్లో రెండు వసతి గృహాలకు సంబంధించిన 120 మంది విద్యార్థులుంటున్నారని, గదులు వర్షంతో ఎప్పుడు కూలిపోతాయోనని విద్యార్థులు భయపడుతున్నారు. అంతేకాకుండా సాంఘిక సంక్షేమ శాఖలో చదువుతున్న విద్యార్థులకు నేటికీ నోటు పుస్తకాలు ఇవ్వలేదని, రెండు సంవత్సరాల క్రితం వచ్చిన సోలార్ హీటర్ నేటికీ వసతి బిగించలేదన్నారు. ప్రతి హాస్టలకు రెగ్యులర్ వార్డెన్ నియమించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సర్వేలో వచ్చిన సమస్యలపై కలెక్టర్, సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కేవీపీఎస్ పోరాడుతుందన్నారు.

తహసీల్దార్‌గా రియాజ్ అలీఖాన్

నవతెలంగాణ-వాంకిడి

మండల నూతన తహసీల్దార్‌గా రియాజ్ అలీఖాన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన రోహిద్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రియాజ్ అలీఖాన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

ఎంపీడీఓగా నజ్రుల్ ఉల్లాఖాన్

మండల నూతన ఎంపీడీఓగా నజ్రుల్ ఉల్లాఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన వీవీ వరలక్ష్మి కరీంనగర్ జిల్లా మానుకోడూరు మండలానికి బదిలీ కాగా పెంచికల్‌పేట్ మండలం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నజ్రుల్ ఉల్లాఖాన్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు.

ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలి



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని చిన్నరాస్పెల్లి, గెర్రే, అమరగొండ, చంద్రపల్లి, కొంచవెల్లి, దహెగాం పాఠశాలల్లో పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు ఏట్యారీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మేకల కొమురయ్య, మండల అసోసియేషన్ అధ్యక్షుడు దూడం తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో పూర్వ ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించి ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలకు ఉచిత కరెంటు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ, సమగ్ర శిక్ష నందు పనిచేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు మినీమం టైమ్స్‌స్కేల్ ఎంటీఎస్ మంజూరు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు అదనపుగా ఐదు సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో శంకరయ్య శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రవికుమార్, కిరణ్, వంశీ, సాయికిరణ్, అనురాధ, సాహితీ, ఉమా పాల్గొన్నారు.

రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్

నవతెలంగాణ-రెబ్బెన

మండల తహసీల్దార్‌గా రామ్మోహన్‌ను నియమిస్తు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా అక్కడ పనిచేసిన తహసీల్దార్ జ్యోత్స్న మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. కాగా ఆమె స్థానంలో రామ్మోహన్ బదిలీ అయ్యారు. ఆయన గతంలో రెబ్బెన డిప్యూటి తహసీల్దార్‌గా పనిచేశారు.

కార్గిల్ విజయోత్సవ దివస్ ర్యాలీ



కాగజ్‌నగర్‌లో నిర్వహిస్తున్న మోటారు సైకిల్ ర్యాలీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం కార్గిల్ విజయోత్సవ దివస్ ర్యాలీని నిర్వహించారు. పాకిస్తాన్‌పై భారత్ సాధించిన కార్గిల్ విజయానికి 25 ఏండ్లు పూర్తయ్యిన సందర్భంగా పట్టణంలో బీజేపీ యువమోర్చా, ఆర్మీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని పలు వీధుల గుండా సాగి కోసిని గ్రామానికి చేరుకుంది. అక్కడ అమరుడైన సంతోష్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ 1999లో కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ దళాలపై భారత్ సాధించిన విజయాన్ని ప్రతి ఒక్కరు గమనంలో ఉంచుకోవాలని అన్నారు. అప్పట్లో సాయుధ బలగాలు ప్రదర్శించిన ధైర్యసాహసాల వల్లే నేడు దేశంలో మనం శాంతియుతంగా జీవనం సాగించగలుగుతున్నామన్నారు. అనంతరం స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో ఎక్స్ సర్వీస్‌మెన్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ, యువమోర్చా, రిటైర్డ్ ఆర్మీ అసోషియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో..

కాగజ్‌నగర్‌లో సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఆకుల నాగేశ్వర్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు ఎఎస్ఆర్ మూర్తి, ఎల్లాగౌడ్, రమణయ్య, కోటేశ్వర్‌రావు, చిలుక లక్ష్మినారాయణ, ప్రతాప్‌సింగ్, ఎం.రాంబాబు, మసూద్ పాల్గొన్నారు.

విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అసెంబ్లీలో గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించారని, ఈ కేటాయింపులు పెంచాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి శాంతికుమారి, సోయం ఇందూరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెరిగినా, ప్రభుత్వ విద్యారంగానికి ఈ కేటాయింపు కూడా సరిపోదని పేర్కొన్నారు. పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, మరుగుదొడ్లు, మంచినీటి వసతులు లేవని, ఈ వసతుల కల్పనతో పాటు అల్పాహారం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు ఈ కేటాయింపులు సరిపోవని అన్నారు. సీఎం ఇచ్చిన హామీ ప్రకారం సర్వీసు పర్సన్ల నియామకం, ఉచిత విద్యుత్తు అమలు ప్రస్తావనలు బడ్జెట్‌లో లేనే లేవని అన్నారు. పాఠశాల విద్యలో సంస్కరణలు చేసే ముందు క్షేత్ర స్థాయిలో తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకోవాలని వారు కోరారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని అఖిల భారత విద్యార్థి సంఘం (ఎఐఎస్ఎ) రాష్ట్ర నాయకులు అల్లి సాగర్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఫీజు రియంబర్స్‌మెంట్, ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు లేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ తరుణంలో కేవలం 7.31 శాతం నిధులు కేటాయించడం సిగ్గుచేటని అన్నారు. తక్షణమే రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

హామీ మేరకు ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గతంలో చేవెళ్ల బహిరంగ సభలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించి అమలు చేయాలని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట మోర్చా జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో జిల్లా ఉపాధ్యక్షుడు కాంద్రే విశాల్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక డిక్లరేషన్ ప్రవేశపెడతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల్లో అధికారం కోసం ఆరు గ్యారెంటీలని చెప్పి వాటి అమలులో అనేక కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. వీటితో పాటు బడ్జెట్‌లో జిల్లాకు కనీస నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఎస్టీ డిక్లరేషన్ తీసుకువచ్చే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం సుభాష్, జిల్లా కార్యదర్శులు కొట్నాక రామ్ షావ్, పెందూర్ మారుతి, జిల్లా నాయకులు బొమ్మెన శ్రావణ్ గౌడ్, సెడ్మాకి తుకారాం, దుర్గం పెంటు, సిడాం శంకర్, నగోసే హనుమంతు, కనక ప్రకాష్, సిడాం భీంరావు, విరాట్, రమేష్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలకు చర్యలు

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-వాంకిడి

ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకున్నామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వర్షాకాలం దృష్ట్యా అంటు వ్యాధులు, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు అందించాలని, వ్యాధుల వ్యాప్తిని నియంత్రించేందుకు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు నివాస ప్రాంతాలలో మురుగునీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించేలా వివరించాలన్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని నార్లాపూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి కేంద్రం ఆధునీకరణకు చేయాల్సిన మరమ్మత్తులు, కల్పించాల్సిన వసతులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి, మరమ్మతు పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలకు సకాలంలో పౌష్టిక ఆహారం అందించి వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తిని అరికట్టే జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శారీరక, మానసిక ఎదుగుదల తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారిని సాధారణ స్థితికి తీసుకువచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

వరద బాధితులకు పోలీసుల సాయం



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత బ్యాక్ వాటర్ వల్ల ముంపునకు గురైన తలాయి, తిక్కపెల్లి, భీమారం గ్రామస్తులు బయటికి వెళ్లలేని పరిస్థితులులో ఉన్నారు. దీంతో 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్సై బి.విక్రమ్ మూడు గ్రామాల ప్రజలకు నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. వరద బాధితులకు సాయం చేసి బెజ్జూరు పోలీసులు మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మోహన్ నాయక్, తలాయి మాజీ ఎంపీటీసీ లంగారి శ్రీనివాస్, కృష్ణపెల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లశ్రీమంత్, వెంకటేష్, నాయకులు దందర ఇస్తారి, హోంగార్డులు మహేష్, శంకర్, లక్ష్మణ్, గ్రామస్తులున్నారు.

ఆదివాసీ చిత్రకళ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సిడాం నగేష్

నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసీ చిత్రకళ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షుడిగా సిడాం నగేష్ ఎన్నికయ్యారు. ఈనెల 22న ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన ఆదివాసీ చిత్రకళ అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎన్నిక కార్యవర్గ సమావేశంలో ఉమ్మడి జిల్లా చిత్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. చిత్ర కళ రంగంలో పని చేస్తున్న వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

నవతెలంగాణ
మంచిర్యాల
శనివారం | జులై 27, 2024 | www.navatelangana.com

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్



ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో విధులు నిర్వహిస్తున్న డే వాచ్మెన్, నైట్ వాచ్మెన్, కుక్, కామటి అవుట్ సోర్సింగ్ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ)జిల్లా ప్రధాన కార్యదర్శి డి బ్రహ్మానందం అన్నారు. శుక్రవారం షెడ్యూల్డ్ కులాల డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ పి రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు నెలలుగా ఔట్ సోర్సింగ్ వర్కర్స్ వేతనాలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వాలు మారిన ఔట్ సోర్సింగ్ వర్కర్స్ జీవితాలు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, కిరణ్, సునీత, లత,ప్రమీల పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలు రద్దు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మండల విద్యాధికారి పోచయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంచిర్యాల, నస్పూర్ మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలు పాటించకుండా విచ్చలవిడి అధిక ఫీజులు తీసుకుంటూ పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారన్నారు. ఇటువంటి పాఠశాలలపై తక్షణమే అధికారులు స్పందించి గుర్తింపులను రద్దు చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల తరపున కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అభినవ్, జిల్లా నాయకులు అరవింద్ పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి



నవతెలంగాణ-జైపూర్

ఏకదాటిగా వర్షాలు కురుస్తున్నందున ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఫ్రైడే డ్రైడే సంధర్భంగా ఇల్లిల్లు తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి కుటుంబం పాటించాలని కోరారు. ఉపయోగంలో లేనటువంటి పాత్రల్లో వర్షపు నీరు నిలిచి ఈగలు, దోమలు వ్యాప్తి చెంది ప్రాణాంతక వ్యాధులను తెచ్చిపెడుతాయని హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో వన మహోత్సవం జరుపుకోవాలని, పల్లెప్రకృతి వనం, బృహత్ పల్లె ప్రకృతి వనం, సెగ్రిషన్ షెడ్, వైకుంఠధామంలలో విరివిరిగా మొక్కలు నాటాలని కోరారు.

దేశ రక్షణే ఊపిరిగా పోరాడుతున్న సైనికులు

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్



దేశ రక్షణే ఊపిరిగా తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న సైనికులు చేస్తున్న త్యాగం మరువలేనిదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఎ.సి.పి. ప్రకాష్, సి.ఐ. బన్సీలాల్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమంగా దేశంలోకి చొరబడిన వారితో ఆర్మీ అధికారులు, సైనికులు వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేశారని, కార్గిల్ ఘటన ప్రతి భారతీయుడిలో చెరగని ముద్ర వేసిందని అన్నారు. కార్గిల్ భూభాగంలోకి 1999 మే నెలలో ఉగ్రవాదులు చొరబడగా దాదాపు రెండున్నర నెలల పాటు అలుపెరుగని పోరాటం చేసి జూలై 26, 1999న కార్గిల్కు విముక్తి కల్పించారని, ఈ పోరాటంలో ఎందరో ఆర్మీ అధికారులు, సైనికులు దేశం కోసం తమ ప్రాణాలను తణప్రాయంగా త్యాగం చేశారని, వీరి త్యాగాలు ఎన్నటికీ చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి మడావి గంగారాం



నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా గిరిజనాభివద్ధి అధికారి మడావి గంగారాం అన్నారు. శుక్రవారం జిల్లాలోని పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతిగృహంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖలోని 4వ తరగతి (కుక్, కమాటి) ఉద్యోగులకు "ఆహారభద్రత-పరిశుభ్రత" అంశంపై ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమానికి ఏటీడీఓ చిరంజీవితో కలిసి హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వర్షాకాలం కావడంతో ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించాలని, తాజా కూరగాయలతో వంట చేసి సకాలంలో మెను ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వసతిగృహం పరిసరాలు, గదులు, మూత్రశాలలు శుభ్రంగా ఉంచుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

జీరో శాలరీ అకౌంటుతో సామాజిక భద్రత



నవతెలంగాణ-నస్పూర్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కార్పొరేట్ జీరో శాలరీ అకౌంటుతో కాంట్రాక్ట్ కార్మికులకు సామాజిక భద్రత ఉంటుందని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా ఎస్ అండ్ పీసీ భద్రత విభాగంలో ఎఫ్ఎంఎస్ సెక్యూరిటీ సంస్థ ద్వారా పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులందరికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కార్పొరేట్ జీరో అకౌంట్‌ను జీఎం చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, ఇన్‌చార్జ్ ఎస్ఓ టూ జీఎం గోపాల్ సింగ్, డీజీఎం అరవింద్ రావు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీ మోహన్, భద్రత విభాగం సీనియర్ అండ్ జూనియర్ ఇన్స్‌పెక్టర్‌లు, షిఫ్ట్ జమేదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రిజర్వేషన్ డే

లక్సెట్టిపేట-లక్సెట్టిపేట



రిజర్వేషన్ పితామహుడు ఛత్రపతి మహారాజ్ మొట్టమొదటి సారి సమానత్వంతో కూడిన పాలన అందించాడని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కో కన్వీనర్ కొల్లూరి రవి కుమార్ పేర్కొన్నారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రిజర్వేషన్ డే సందర్భంగా వాగేశ్వర జూనియర్ కాలేజీలో పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్‌కు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశానికి అన్ని వర్గాల్లో రాజకీయ, ఆర్థిక, సామజిక రంగాల్లో సమానత్వం నేర్పిన మహనీయుడని, అయన చేసిన సేవలను కొనియాడారు. ఛత్రపతి సాహు మహారాజ్ కొల్లాపూర్ సంస్థాన రాజ్య పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ వర్గాలకు మొట్టమొదట రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన మహనీయుడన్నారు. ఆ కాలంలో మహిళలకు చదువుని ఉచిత నిర్బంధ విద్య, బాల్య వివాహలను రద్దు చేస్తూ, వితంతు పునర్వివాహలను చట్ట బద్దము చేశాడన్నారు. సాహు మహారాజ్‌ను అంబేద్కర్ ఆదర్శంగా తీసుకోని ఆలోచన, ఆశయ లక్షాలను భారత రాజ్యాంగంలో పొందుపరచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అల్ ఇండియా గిరిజన విద్యార్థి సంఘం జాతీయధ్యక్షుడు ఇందల్ రాథోడ్, అల్ ఇండియా అంబేద్కర్ సంఘం మండల నాయకుడు దర్శనాల నవీన్ కుమార్, అంబేద్కర్ యువజన సంఘం పట్టణధ్యక్షు విక్రమ్, మంచాల కుమార్, యూత్ నాయకుడు అయిల్ల ప్రశాంత్, వినయ్ పాల్గొన్నారు.



మంచిర్యాల : ఛత్రపతి సాహు మహారాజ్ అందించిన రిజర్వేషన్ల రక్షణ తో పాటు సమగ్ర సామాజిక న్యాయ సాధన కోసం దేశంలోని బహు జనులందరు ఐక్యంగా ఉద్యమించాలని వివిధ సామాజిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మంచిర్యాలలోని చార్వాక ట్రస్ట్ హాల్‌లో జరిగిన 122వ రిజర్వేషన్ డే సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఛత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మంచిర్యాల జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, సమతా సైనిక్ దళ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పట్ల బాధ్యతగా వ్యవహరించాలి



నవతెలంగాణ-జైపూర్

వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నుంచి మనకు మనం రక్షించుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పట్ల ఎవ్వరికి వారు బాధ్యతగా వ్యహరించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామగిరి రాము అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వారం పది రోజుల నుండి కురుస్తున్న వర్షాలతో ఇంటి గోడలు, పాత ఇండ్లు కూలిపోతున్నందున సురక్షిత ప్రాంతంలో ఉండాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ నివాస ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నీటి నిల్వలు పేరుకుపోతే ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతాయని అన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ నాయకులు అభిషేక్, మధు, సిసిందర్, రాజ్‌కుమార్, చరణ్ రంజిత్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ బరిలో సుమన్

నవతెలంగాణ-జైపూర్

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గెలిపించాలని ముదిగుంట గ్రామ పంచాయతి కాంగ్రెస్ నాయకుడు సుమన్ అభ్యర్థించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల యూత్ ప్రసిడెంట్‌గా వారం రోజుల క్రితం ఆన్‌లైన్‌లో నామినేషన్ ధాఖలు చేసినట్లు తెలిపారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ యాప్ ద్వార ఓటు వేసే అవకాశం ఉన్నందున ఆగస్టు 5 నుంచి ఓటు వేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. యూత్ అధ్యక్షునిగా తనకు ఓటు వేసి కాంగ్రెస్ ద్వార ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-వేమనపల్లి



వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేక అధికారి వి.ఉదయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన ముందుగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అమ్మ ఆదర్శ పాఠశాల, పురుగుల మందుల దుకాణం తనిఖీ చేశారు. ధరల పట్టిక బోర్డుపై ఉంచాలని, రైతులు మందులు తీసుకున్నాక రసీదులు ఇవ్వాలని సూచించారు. అనంతరం నీల్వాయి ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల, వరద దాటికి కొట్టుకుపోయిన మామడ వాగును పరిశీలించారు. అలాగే చౌక ధరల దుకాణం తనిఖీ చేసి బియ్యం సరఫరాలో ఇబ్బందులు ఉంటే తెలపాలని సూచించారు. వేమనపల్లి నుండి సుంపుటం గ్రామ శివారులోకి ప్రాణహిత బ్యాక్ వాటర్ రాకపోకలు నిలిచిపోగా సందర్శించి ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలాగే అత్యవసరమైతే తప్ప గ్రామం విడిచి రావద్దని సూచించారు. అనంతరం బాలుర ఆశ్రమ పాఠశాల తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు తరగతి గదులను పరిశీలించారు. గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలనీ సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మయూరి, స్టాఫ్ నర్స్ శ్రీవాణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆక్యూపేషనల్ హెల్త్ సర్వీసెస్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ డిస్పెన్సరీలో సుమారు రూ.15 లక్షలతో ఆధునీకరించిన ఆక్యూపేషనల్ హెల్త్ సర్వీసెస్ సెంటర్‌ను జనరల్ మేనేజర్ సేఫ్టీ గురువయ్య, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ సేఫ్టీ కార్పొరేట్ గురువయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఉద్యోగుల సంబంధిత అంశాలు ఉద్యోగుల కుటుంబ సభ్యుల అంశాలను సింగరేణి హాస్పిటల్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా రికార్డు చేయడం జరుగుతుందన్నారు. దీని ద్వారా వారి యొక్క ఆరోగ్య పరిస్థితి త్వరగా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని, అందులో భాగంగా అన్ని ఆసుపత్రులను సాంకేతికంగా అభివృద్ధి పరచడం జరుగుతుందని, నస్పూర్ డిస్పెన్సరీని కూడా అలా చేయడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్ రఘుకుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు పాల్గొన్నారు.

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

నవతెలంగాణ-జన్నారం



మొక్కలు నాటడమే కాదు వాటిని పూర్తిస్థాయిలో సంరక్షించినప్పుడే మంచి ఫలితం ఉంటుందని, కవ్వాల్ క్లస్టర్ ఏఈఓ అక్రమ్ అన్నారు. శుక్రవారం దేవునిగుడా రైతు వేదిక వద్ద హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి హరిత తెలంగాణకు సహకరించాలని కోరారు.

అధికారులు స్థానికంగా ఉండాలి

నవతెలంగాణ-తాండూర్

అధికారులు స్థానికంగా ఉంటూ తమ విధులను నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ గజానంద్ సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అధికారులు స్థానికంగా ఉంటూ విధులను నిర్వహించాలని తెలిపారు. పారిశుధ్యం, హరితహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీల్లో ప్రత్యేక డ్రైవులు నిర్వహించాలని తెలిపారు. నీటి ట్యాంకులు ఎప్పుడు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పంచాయతీ గ్రామాలలో నీటి గుంటలను పూడ్చాలని తెలిపారు. మీరు నిలిచిన ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల ఉధృతిని తగ్గించాలని తెలిపారు. ఓపెన్ వేల్స్‌లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ అనిల్ పంచాయతీ సెక్రెటరీ ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

వాహనాలకు నెంబర్ ప్లేట్లు తప్పక ఉండాలి

నవతెలంగాణ-నస్పూర్

వాహనల యజమానులు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్లను అమర్చుకోవాలని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా బస్టాండ్‌లో వాహన తనిఖీలు చేసి నెంబర్ ప్లేట్లు సరిగా లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వాహనాల యజమానులకు తప్పుడు నెంబర్ ప్లేట్లు, మైనర్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్ పై ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర, ఆటో, నాలుగు చక్రాల వాహనాలతో పాటు భారీ వాహనాల కైనా తప్పనిసరిగా నంబర్ ప్లేట్ కనబడే విధంగా అమర్చుకోవాలని అన్నారు. లేని యెడల పోలీసు శాఖ తరపున నిర్వహించే తనిఖీ సమయంలో పట్టుబడితే అట్టి వాహనానికి జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల నిల్వ వివరాలను స్టాక్ బోర్డులపై ఉంచాలి

నవతెలంగాణ-తాండూర్

ఎరువుల నిల్వకు సంబందించిన వివరాలను ధరల పట్టికను దుకాణాల్లో ఏర్పాటుచేసిన స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి మండల స్పెషల్ ఆఫీసర్ విల్లి గజానంద్ సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి కిరణ్మయితో కలిసి మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. చెరువులకు పురుగుల మందులకు సంబంధించిన రిజిస్టర్లు, బిల్ పుస్తకాలను, లైసెన్సులను పరిశీలించారు. రైతులకు నాసిరకమైన విత్తనాలు, ఎరువులను అమ్మ రాదని, నాణ్యమైనవి అమ్మలని తెలిపారు. ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని సూచించారు. రైతులకు ఎరువులు విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు.

ఉద్యోగులకు క్వాటర్ల కౌన్సిలింగ్

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి ఎన్సీ డబ్ల్యూ ఉద్యోగులకు శుక్రవారం సీఈఆర్ క్లబ్‌లో క్వాటర్ల కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌లో 79 క్వాటర్స్ ప్రకటించగా 74 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. సీనియార్టీ ప్రకారం 26 మంది ఎన్సీ డబ్ల్యూ ఉద్యోగులకు పారదర్శకంగా క్వార్టర్లను కేటాయించడం జరిగిందని ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, డీజీఎం ఐఈడీ రాజన్న, డీవైపీఎం మైత్రేయ బంధు, రాజలింగు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరిశుభ్రమైన నీటిని అందించాలి

నవతెలంగాణ-తాండూర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పరిశుభ్రమైన నీటిని అందించాలని మండల ప్రత్యేక అధికారి గజానంద్ సూచించారు ఆయన శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి తాండూరు కస్తూరిబా గురుకులాన్ని ఆకస్మికంగా సందర్శించారు. హాజరు రిజిస్టర్లు, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల వసతి సౌకర్యాల గురించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందించే భోజనాల గురించి ఆరా తీశారు. పరిసరాలు శుభంగా ఉండాలని విద్యార్థినులకి మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వీలైనంత మటుకు భోజనాలు వేడిగా ఉండేటట్టు చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రత్యేకాధికారి సుమన చైతన్య, ఏఎన్ఎం ఊర్మిళ, టీఈటీ సరళ, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, వంశీ పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

వృత్తిపరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంఎస్ మెడికల్ జార్జి జాన్ అన్నారు. శుక్రవారం సింగరేణి గెస్ట్ హౌస్ సీసీసీలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో వృత్తిపరమైన ఆరోగ్య సమస్యలు భవిష్యత్తు ప్రణాళికలపై సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంఎస్ మెడికల్ జార్జి జాన్, జీఎం కార్పొరేట్ సేఫ్టీ గురువయ్య, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగులు వారి ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల పైన కులంకషంగా చర్చించడం చాలా సంతోషకరమైన విషయమని, అలాగే భవిష్యత్తులో వృత్తి పర వ్యాధులు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను కూలంకషంగా చర్చించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి జీఎం రవి ప్రసాద్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘు కుమార్, కొత్తగూడెం రీజియన్ సేఫ్టీ జీఎం తివారి, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పౌష్టికాహార పంపిణీ సక్రమంగా జరగాలి

నవతెలంగాణ-తాండూర్

అంగన్‌వాడీ టీచర్లు పౌష్టికాహార పంపిణీ సక్రమంగా జరిగేటట్టు చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప రాణి తెలిపారు. శుక్రవారం తాండూరు సెక్టార్‌లోని రేచిని 3 అంగన్‌వాడీ కేంద్రం నందు 6 నెలల నిండిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వెంకటమ్మ ఆయా మల్లు బాయ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | జులై 27, 2024 | www.navatelangana.com

మాదకద్రవ్యాల నియంత్రణలో యువత కలిసి రావాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మాదకద్రవ్యాల నియంత్రణలో యువత తమతో కలిసి రావాలని సీఐ సతీష్ అన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన మాదక ద్రవ్యాల నియంత్రణ అవగాహన కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానందుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించే యువత మాదకద్రవ్యాల వైపు చూడడం బాధాకరమన్నారు. జిల్లాలో వాటిని నివారించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో నివారణకు ప్రజల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజేశ్వర్, ప్రవీణ్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం

నవతెలంగాణ-లోకేశ్వరం



ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్, అటెండర్లు, పంచాయతీ కార్యదర్శులు బదిలీ కాగా వారిని ఎంపీడీఓ సోలమన్ రాజ్ సన్మానించారు. మండలంలోని కిష్టాపూర్, బామ్ని, వట్టోలి, పిప్రి, గడ్చంద పంచాయతీ కార్యదర్శు సాయిరాజ్, గంగాధర్, రాము, రాజేందర్, రాఘవేందర్‌లతో పాటు సీనియర్ అసిస్టెంట్ భూమ్‌రా, అటెండర్లు విజయ్, సాయన్న, రజినీ బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారిని సత్కరించి జ్ఞాపికలు అందించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సూపరింటెండెంట్ వెంకట రమేష్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ రోడ్లు అస్తవ్యస్తం



నవతెలంగాణ-బేల

మండల కేంద్రం నుండి తెలంగ్‌రావ్ గూడ వరకు ఉన్న పంచాయతీ రాజ్ గ్రామీణ రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. దాదాపుగా మండల కేంద్రం నుండి ఐదు కిలో మీటర్లు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా తయారైంది. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై తారు కొట్టుకుపోయి అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. మండల కేంద్రం నుండి సైద్‌పూర్ వెళ్లే ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. వ్యవసాయం చేసే రైతులు, స్కూల్ బస్సులు, ప్రభుత్వ అధికారులు సైతం ఇదే రోడ్డుపై ప్రయాణిస్తుంటారు. కానీ ఆ రోడ్డు దుస్థితిపై పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. తెలంగాణ ప్రభుత్వం గతంలో మసాలా-బి నుండి కొంత మేరకు బీటి రోడ్డు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు డబ్బులు రాక ఆ పని ఆగిపోయింది. కొత్త రోడ్డు వేయడం పక్కనపెడ్డితే కనీసం మరమ్మతులు కూడా చేసిన పాపాన పోకపోవడం గమనార్హం. మండల కేంద్రం నుంచి ఉన్న పంచాయతీ రాజ్ బీటి రోడ్లకు మర్మత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దళితులపై సవతి ప్రేమను చూపుతున్న సీఎం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి దళితులపై సవతి ప్రేమ చూపుతూ బడ్జెట్ తగ్గించారని బీజేపీ దళిత మోర్చ జిల్లా అధ్యక్షుడు అస్తక్ సుభాష్ అన్నారు. బడ్జెట్‌లో దళితులకు నిధులు తగ్గించడాన్ని నిరసిస్తూ పట్టణంలోని కలెక్టర్ చౌరస్తాలో దళిత మోర్చ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు దళితులకు అనేక హామీలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి బడ్జెట్‌ను తగ్గించి మోసం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రూ.36 వేల 750 కోట్లు పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.33 వేల 150 కోట్లు పెట్టిందన్నారు. ఈ బడ్జెట్లో రూ.3500 కోట్లు తగ్గించారని ఆరోపించారు. దళితుల అభ్యున్నతికి బడ్జెట్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత మోర్చ ప్రధాన కార్యదర్శి ధరంపల్, పట్టణ అధ్యక్షుడు ధీకొండ హనుమాన్, ఉపాధ్యక్షుడు గోవర్ధన్, కార్యదర్శి బొజ్జ మహేందర్, గిరిజన మోర్చ నాయకులు చాకటి కిరణ్ పాల్గొన్నారు.

బురద మయంగా కుండి సేకుగూడ రోడ్డు

నవతెలంగాణ-నార్నూర్

వర్షకాలంలో రోడ్డు బురద మయంగా మారీ రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోందని గాదిగూడ మండలంలోని కుండి సెకుగూడ వాసులు కుమ్ర భీంరావ్, ఆడా దీలిప్, గణపత్, సీతారాం ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి ఐటీడీఏ ద్వారా రోడ్డు సౌకర్యం కల్పించాలని పీఓ, కలెక్టర్, ప్రజాప్రతినిధులను విన్నవించిన ఫలితం లేకుండా పోయిందన్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో పిప్రి గ్రామం నుండి కుండి సేకుగూడ వరకు దాదాపు 7 కిలోమీటర్ల దూరంలో వర్షం కారణంగా గర్భిణులకు ఆస్పత్రికి తరలించాలంటే మార్గ మధ్యలోనే ప్రసవాలు కావడం, ప్రాణాలు పోయిన సంఘటనలున్నాయన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షకాలం నేపథ్యంలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటి డీఎంహెచ్ఓ డా. సాధన సూచించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా అంకోలి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో కలిసి పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో అవగాహన కల్పించారు. కాలనీలో పర్యటిస్తు కలుష నీరు, దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి కళాకారులతో తెలియజేస్తు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు విస్తరంగా కురుస్తున్నందున నీరు నిల్వకుండా చూడాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ మిషనర్ ఖమర్ అహ్మద్, అంకోలి మెడికల్ ఆఫీసర్ డా.సర్ఫరాజ్, సానిటరి ఇన్స్‌పెక్టర్ నరేందర్, వార్డు కౌన్సిలర్ డా.లక్ష్మణ్ పాల్గొన్నారు.

టీజీవీపీ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-బోథ్

మండలకేంద్రంలో శుక్రవారం తెలంగాణ విద్యార్థి పరిషత్(టీజీవీపీ) 12వ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను నియోజకవర్గ కన్వీనర్ గొర్ల నరేందర్ యాదవ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా బోథ్ కో కన్వీనర్ ఉలెంగ్గుల సతీష్ మాట్లాడుతూ తెలంగాణ సాధనే లక్ష్యంగా ఏర్పడ్డ టీజీవీపీ అనాతి కాలంలోనే తెలంగాణలోనే ప్రశ్నించే గొంతుక మారిందన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అలాగే టీజీవీపీ పోరాట ఫలితంగానే విద్యార్థుల చాలా సమస్యలు పరిష్కరించబడ్డాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, రాజు, కృష్ణ, రాము, అజయ్, శీను, విజయ్ పాల్గొన్నారు.



ప్రమాదపుటంచున నాటు పడవ ప్రయాణం

- జలదిగ్బంధ గ్రామ ప్రజల కష్టాలు
- వేలాది ఎకరాల్లో పంట నష్టం





నవతెలంగాణ-బెజ్జూర్

వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, మరోవైపు మహారాష్ట్రలో ఎగువ ప్రాంతంలో ప్రాణహిత నదిలో వదిలిన వరదనీటిలో బెజ్జూరు మండలం అతలాకుతులమవుతుంది. మండలంలోని 12 గ్రామాలకు రవాణా సౌకర్యం అస్తవ్యస్తమైంది. 12 గ్రామాల ప్రజలు ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని తలాయి తిక్కపల్లి, భీమారం గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలో మగ్గుతున్నాయి. గ్రామాల్లో నిత్యావసర వస్తువుల కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రవాణా వ్యవస్థ స్తంభించడంతో నాటుపడవల్లో ప్రమాదం అంచున ప్రజలు ప్రయాణిస్తూ మండలానికి చేరుకుంటున్నారు. ప్రాణహిత సరిహద్దు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పత్తి పంటల నష్టపోయాయి. కనీసం రెవెన్యూ, వ్యవసాయ శాఖ శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదని రైతుల ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వేలాది ఎకరాల్లో వేసిన పంటలు నష్టపోయిన రైతాంగని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

బంగారి భూపతి, తలాయి గ్రామస్తుడు



ప్రాణహిత బ్యాక్ వాటర్ వల్ల 10 ఎకరాల్లో పత్తి పంట నష్టపోయాను. నష్టపోయిన రైతాంగని ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రాణహిత బ్యాక్ వాటర్ వల్ల ఏటా పంటలు నష్టపోతున్నాం. అధికారులు, ప్రభుత్వం సర్వే నిర్వహించి తమను ఆదుకోవాలి.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



నవ తెలంగాణ ఆదిలాబాద్ రూరల్

ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ పోరాట దినాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పల్లె, గూడ, పట్టణాలలో ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుం దెబ్బ) రాష్ట్ర గోడం గణేష్ కోరారు. మావల మండలంలోని కుమురం భీం కాలనీలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. 1982 సంవత్సరంలో ఆగస్టు 9న జెనీవాలో ఐక్యరాజ్యసమితి ఆదివాసీ హక్కుల కోసం మానవ హక్కుల మేధావులతో అంతర్జాతీయ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఆనాటి నుండి ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 9ను ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. తమ హక్కులను పరిరక్షించుకోవడం భాష సంస్కృతి సంప్రదాయాలు అంతరించిపోతున్న తెగల కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మండల అధ్యక్షుడు వెడ్మ ముకుంద్, రైతు సంఘం డివిజన్ ఉపాధ్యక్షులు మెస్రం తులసిరామ్, ఆదిలాబాద్ డివిజన్ ఉపాధ్యక్షులు కుడుమేత ప్రకాష్, మహిళా సంఘం డివిజన్ ఉపాధ్యక్షురాలు కుమురం శాంతాబాయి, డివిజన్ ప్రచార కార్యదర్శి తోడసం ప్రకాష్, గోవింద్ రావు, పెందూర్ రామచందర్ పాల్గొన్నారు.

కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించాలి

- జిల్లా విద్యాధికారి అశోక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, నవంబర్‌లో నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా చూడాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ కనీస అభ్యసన సామర్థ్యాలు పొందేలా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. తరగతి గదికి వెళ్లే సమయంలో పాఠానికి సంబంధించిన కనీస సామర్థ్యాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాటిని సాధించడానికి ఎటువంటి బోధనా పద్ధతులు పాటించాలనే విషయాన్ని ముందుగా నిర్ణయించుకోవాలన్నారు. ప్రస్తుత సంవత్సరం నవంబర్‌లో నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆ దిశగా ఇప్పటి నుండే ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్ సుభాష్, జిల్లా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

నాడు అలా...నేడు ఇలా



నవతెలంగాణ-దహెగాం

చుట్టూ గుట్టలు అందమైన అటవీ ప్రాంతం అందులోంచి ఒకవైపు నుంచి ప్రాణహిత, మరోవైపు నుండి వచ్చే పెద్దవాగు రెండు ఒకచోట కలగలిసి ఉన్న గ్రామమే మొట్లాగూడ. ఇది మండల కేంద్రానికి సుదూరంగా దట్టమైన అడవుల మధ్యలో ప్రశాంత వాతావరణంలో ఉంది. కానీ ఇక్కడి వాతావరణం కాలనికనుగుణంగా మారుతూ ఉంటుంది. వేసవిలో చల్లచల్లగా, చలి కాలంలో మంచు కురిసే ప్రాంతాన్ని తలపించేలా పొగమంచు కమ్ముకుంటుంది. ఇక వర్షా కాలంలో మరింత బిన్నంగా చుట్టూ పెద్దవాగు, ప్రాణహితల బ్యాక్ వాటర్‌తో పంటలన్నీ మునుగుతూ సముద్రాన్ని తలపిస్తుంది. ఇదంతా విని చూసే వారికి అహ్లాదాన్ని పంచె ప్రాంతంలా ఉన్న అక్కడి రైతులకు మాత్రం వర్షా కాలం పంటలను ముంచుతూ ఎండాకాలం దాహార్తిని తీర్చే నీరు లేని పరిస్థితులను ఏర్పరుస్తూ ఉంటటం గమనార్హం.



విద్యారంగాన్ని నిరాశపర్చిన రాష్ట్ర బడ్జెట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్ నిరాశ పర్చిందని, విద్యారంగ అభివృద్ధికి బడ్జెట్ సవరించి నిధులు పెంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ అజ్మీర అన్నారు. శుక్రవారం పట్టణంలోని కుమురం భీం భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర విద్యారంగ అభివృద్ధి కోసం కేంద్రీకరిస్తామని మాటలు చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు కేవలం 7.3శాతం నిధులు కేటాయించడం పేద విద్యార్థులకు విద్యను దూరం చేయడంలో భాగమేనన్నారు. విద్యార్థులకు గత ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీల అమలుపై ప్రస్తావన లేదన్నారు. స్కాలర్షిప్, ఫీజు రియాంబర్స్‌మెంట్ బకాయిలు ప్రతి ఏడాది పెండింగ్ లేకుండా విడుదల చేస్తామని చెప్పలేదని మండిపడ్డారు. యూనివర్సిటీ అభివృద్ధిపైన సమగ్రమైన ప్రణాళిక రూపొందించలేదని, కేవలం రూ.500 కోట్లు కేటాయించి మౌలిక వస్తువులకు మాత్రమే పరిమితం అవడం ఎంతవరకు సమంజసం అన్నారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి నిధులు పెంచడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అశోక్, జిల్లా నాయకులు బల్వీర్ సింగ్, రాజేష్, రాము, విజయ్ పాల్గొన్నారు.

వేదంలో పాఠశాలలో బోనాల ఉత్సవాలు

నవతెలంగాణ-బోథ్

మండలకేంద్రంలోని వేదం పాఠశాలలో శుక్రవారం బోనాలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పిల్లలు బోనాలు ఎత్తి అమ్మవారిని పూజించారు. విద్యార్థులు అమ్మవారి, పోతరాజు, పులుల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ పండగల సంప్రదాయాల గురించి పిల్లలకి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సంస్మరణ సభ

నవతెలంగాణ-ఉట్నూర్

కమ్యూనిస్టు ఉద్యమ మార్గదర్శి దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి సంస్మరణ సభను మండలంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నేతావత్ రాందాస్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి పాల్గొని మాట్లాడుతూ దేవులపల్లి వెంకటేశ్వరరావు బండమీది చందుపట్ల గ్రామంలో జన్మించి విద్యార్థి దశనుండే కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులై సభ్యత్వం తీసుకున్నారన్నారు. బెనారస్ యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదివి వందేమాతరం ఉద్యమంలో పాల్గొని విప్లవానికి నాంది పలికి భారతదేశంలో ప్రజా ఉద్యమాల ద్వారా మాత్రమే ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కుటికెలా శంకర్, దారెంగుల ఎల్లయ్య, ఉపాధ్యక్షులు నరసయ్య, సిడాం ధర్ము, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అంబాల మహేందర్, ప్రజా సంఘాల జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బానోత్ రామారావు, లంబాడ జేఏసీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ పాల్గొన్నారు.

నిషేధిత యాప్ ఉపయోగిస్తున్న వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం నిషేధించిన అప్లికేషన్ ఉపయోగించి ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న వ్యక్తిని టాస్క్ ఫోర్స్ అధికారులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కసబ్‌వాడికి చెందిన షేక్ ఉమర్ మొబైల్‌లో ప్రభుత్వం నిషేధించిన ఆన్ లైన్ గేమ్ ఆడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుని వద్ద రూ.1000తో పాటు నిందితుడి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ప్రభుత్వ నిషేధించిన ఆన్‌లైన్ గేమ్ ఆడకూడదని తెలిపారు. అటువంటి సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ. గంగన్న పీసీ సంజీవ్ పాల్గొన్నారు.

రుణమాఫీతో బ్యాంకులో జన సంద్రం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ప్రభుత్వం ఇటీవల రూ.లక్షలోపు రుణమాఫీ ప్రకటించడంతో రైతులతో వివిధ బ్యాంకులు జనసంద్రంగా మారాయి. మండలంలోని సహకార బ్యాంకుతో పాటు యూనియన్ బ్యాంకు, డెక్కన్ గ్రామీణ బ్యాంకులున్నాయి. శుక్రవారం మారుమూల గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమతమ పంట రుణమాఫీ ఎంతవరకు అయిందని తెలుసుకోవడం కోసం బ్యాంకుల వద్ద బారులు తీశారు. దీంతో వివిధ బ్యాంకులు కిక్కిరిసి పోయాయి. బ్యాంకు అధికారులు పంచాయతీ, గ్రామాల వారీగా రుణ మాఫీ రైతుల జాబితాను బ్యాంకు ఆవరణలో ప్రదర్శించాలని కోరారు.

వరద నీటి తొలగింపుకు చర్యలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని కాపువాడలో వరద నీటి తొలగింపుకు ఎట్టకేలకు అధికారులు చర్యలు చేపట్టారు. కాలనీలో పలు ఇళ్లు వరద నీటిలో మునిగి ఉండి సమస్యలు తలెత్తడం, పలు పత్రికలలో వార్తలు రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, కౌన్సిలర్ పిర్సింగుల జయచందర్, కమిషనర్ అంజయ్య, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ శుక్రవారం ఆ కాలనీని సందర్శించి వరద నీటి తొలగింపుకు చర్యలు చేపట్టారు. జేసీబీ సాయంతో వరద నీటిని తొలగించారు. అయినా పూర్తి స్థాయిలో వరద నీటి సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. తాత్కాలికంగా వరద నీటిని తొలగిస్తామని, వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలో నివాసం ఉంటున్న టోంబ్రే శారద, ఇంటి గోడ, నక్క శంకర్ వంట షెడ్ ఎడతెరిపి లేని వర్షానికి శుక్రవారం కూలిపోయాయి. ఏటువంటి ప్రాణం నష్టం జరుగన్నప్పటికీ, వర్షానికి నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. తినడానికి ఏమీ లేకుండా దాతల సాయాన్ని ఎదురు చూస్తున్నారు. మండల పాలకులు, అధికారులు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని బాధితులు వేడుకుంటున్నారు.

ప్రత్యేక నిధులు విడుదల చేయాలని వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా సిర్పూరు నియోజకవర్గంలో పంటలు నష్టపోయిన రైతులకు ప్రత్యేకంగా నిధుల విడుదల చేసి ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకులు మంత్రి సీతక్కను కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పీ ఛైర్మెన్ సిడం గణపతి, టీపీసీసీ సభ్యులు అర్షద్ హుస్సేన్, మాజీ ఎంపీపీలు డుబ్బుల నానయ్య, బసార్కర్ విశ్వనాథ్‌లు మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు పంటలు నష్టపోయారనీ, రహదారులు దెబ్బ తిన్నాయని వారు పేర్కొన్నారు. పంట నష్టపరిహారం చెల్లింపు, రహదారుల మరమ్మత్తులకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని వారు మంత్రిని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క త్వరలోనే సర్వే చేయించి ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఉచిత మెడికల్ క్యాంప్

నవతెలంగాణ-బేల



వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభపులే గురుకుల పాఠశాలలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకరయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ వంశీ కృష్ణ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పారిశుద్ధ్యం పైన మండల ప్రత్యేక అవగాహన కలిపించారు. గురుకులం ఆవరణలో నీరు నిల్వ ఉంటే వాటిని తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రిన్సిపాల్ రంగన్న పాల్గొన్నారు.

సౌంలి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని సౌంలి గ్రామంలో ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం గ్రామస్తులు భైంసా ఆర్టీసీ డిపో మేనేజర్ హరి ప్రసాద్‌కు కలిసి సమస్యను విన్నవించారు. డిపో మేనేజరు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఉన్న మహిళలు, యువతీ, యువకులు, విద్యార్థులకు పాఠశాలకు వెళ్లంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

చినుకు పడితే బురదమయం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి రమణారెడ్డి నగర్‌లో చినుకు పడితే చాలు బురదగా రోడ్లు మారుతున్నాయి. పలుమార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో100 కుటుంబాలున్న పట్టించుకునే నాధుడు లేడని, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలనీ పెద్దమనుషులు రోడ్డు మరమ్మతులు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (ఓల్డ్)లో శుక్రవారం విద్యార్థులు, సిబ్బందికి మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. షీ టీం సభ్యురాలు రమాదేవి మాట్లాడుతూ మహిళలకు ఏ సమస్య వచ్చినా నిర్భయంగా పోలీసులకు తెలుపాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా తాము ప్రజలకు మరింత దగ్గరై సేవలందిస్తున్నట్లు తెలిపారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో షీ టీం సభ్యురాలు సునీత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్షిప్ విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్రజీ హరీష్, మడావి గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు పోస్టులను భర్తీ చేయాలని, అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు.

సైనికుల త్యాగం మరువొద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ రక్షణతో పాటు ప్రజలు స్వేచ్ఛగా జీవించడానికి తమ ప్రాణాలను త్యాగం చేస్తున్న సైనికులను స్మరించుకోవాల్సిన అవసరముందని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. శుక్రవారం 25వ కార్గిల్ విజయ్ దివస్‌ను సనాతన హిందూ ఉత్సవ సమితి, మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ పార్కులోని అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. శ్రద్ధాంజలి ఘటించారు. ఎన్సీసీ క్యాడెట్లు ముఖ్య అతిథులను గౌరవంగా స్వాగతించారు. అనంతరం అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలదేవి మాట్లాడుతూ దేశం కోసం సరిహద్దులో కుటుంబాలకు దూరంగా ఉంటూ రక్షణగా ఉంటూ ప్రజలకు స్వేచ్ఛయుత వాతావరణం కల్పిస్తున్న సైనికులను గుర్తించుకోవాలన్నారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను వదులుతున్న అమరుల త్యాగలు చీరస్మరణీయంగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ దేశ రక్షణ కోసం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, సనాత హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్ కుమార్ ఖత్రి, గెడం మహదవ్, రవీందర్, ఆనంద్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్‌దాస్, ఎన్సీసీ నలంద కళాశాల కమాండర్ అశోక్, కెడెట్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

కాంగ్రెస్ ఆధ్వర్యంలో మున్సిపల్ అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళులర్పించారు. డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో పాటు పార్టీ శ్రేణులు పుష్పాంజలి సమర్పించి నినాదాలు చేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, నగేష్, శ్రీలేఖ, బీడీ చారి, బండారి సతీష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో...

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అమరులకు ఘన నివాళులర్పించారు. పట్టణాధ్యక్షుడు అజయ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయకులు అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు పవన్ నాయక్, ప్రకాష్, నాయకులు సాజిదొద్దిన్, పండ్ల శ్రీను, ఫెరోజ్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. ముందుగా మున్సిపల్ పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్చాలతో నివాళులర్పించారు. అనంతరం కళాశాలలో డాక్యుమెంటరీని ప్రదర్శించారు.కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అనిత, వైస్ ప్రిన్సిపాల్ పి ప్రభాత్‌రావు, ఎన్సీసీ కేర్ టేకర్ చంద్రకాంత్, ఎన్ఎస్-ఎస్ పీఓ లు స్వప్న, యాకూబ్ అలీ, ఎన్సీసీ క్యాడెట్లు, వాలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో...

ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ దివస్ నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద ఉన్న స్తూపానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ శశి, జిల్లా కన్వీనర్ అక్షయ్, నిఖిల్, విఘ్నేష్ కార్తీక్, మహేష్, శివసాయి, ఆదిత్య ఉన్నారు.

మాజీ ఆర్మీ సైనికులకు సన్మానం..

కార్గిల్ విజయ దివస్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో మాజీ ఆర్మీ సైనికులను ఘనంగా సత్కరించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఆర్మీ సైనికులను శాలువాలతో సత్కరించి వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, నిఖిల్, శివగౌడ్, రాకేష్ ఉన్నారు.

సైన్స్ డిగ్రీ కళాశాలలో...

ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఎన్సీసీ యూనిట్‌ల ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో క్యాండిల్లు వెలిగించి, అమర జవానులకు నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సైనికుల త్యాగాలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సుబేదారు కవల్జీత్ సింగ్, కెప్టెన్ జగ్రామ్ అంతర్వేది, జాకీర్ హుస్సేన్, అశోక్, రఘునాథ్, ప్రతాప్‌సింగ్, జ్యోత్స్న, అనిత, దయాకర్, నర్సింగరావు విద్యార్థులు పాల్గొన్నారు.

భైంసాలో...

కార్గిల్ వీరుల పోరాటం మరువలేనిదని, భైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు, బీజేపీ పట్టణాధ్యక్షులు మల్లేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు నారాయణరెడ్డి, పట్టణ నాయకులు గాలి రాజు, ప్రవీణ్, మాణిక్ పాల్గొన్నారు.

బోథ్‌లో..

మండల కేంద్రంలోని స్థానిక శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. అలాగే ప్రాణాలను త్యాగం చేసిన వీర సైనికులకు క్యాండిల్స్ వెలిగించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది పంద్రం శంకర్, ప్రధానోపాధ్యాయులు కొండ రాజేందర్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.







పంచాయతీ కార్యదర్శికి సన్మానం




నవతెలంగాణ-తాంసి

పొన్నారి గ్రామ నూతన పంచాయతీ కార్యదర్శి గంగన్నను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. శాలువ, బొకేతో సత్కరించి గ్రామంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. చింతలపెల్లి లింగారెడ్డి, గడుగు గంగన్న, దర్శనాల చిన్నయ్య, అండే అశోక్, ముచ్చరఘు, కేమా లక్ష్మణ్, చెన్నాల సంజీవ్, తొగరి లింగన్న, గడుగు దేవమ్మ, సూరం గంగమ్మ, ఆశ వర్కర్లు, ఆది జ్యోతి, దర్శనాల వేంకటమ్మ, కారోబారి రచ్చ స్వామి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్పీలకు ఒక రోజు శిక్షణ

నవతెలంగాణ-నిర్మల్

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా ఆర్పీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కస్బా హైస్కూల్లో డీఈఓ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 2024 నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ఫలితాల్లో రాష్ట్ర స్థానం మెరుగుపరచుకోవడానికి ఈ సంవత్సరం శిక్షణ చేపట్టామన్నారు. అభ్యసనా ఫలితాలు సాధించుటకు తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన పద్ధతులపైనే ఆధారపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏసీజీ పద్మ, జీసీఓ సలోమి కరుణ, ఎంఈఓ శంకర్, డీఎస్ఓ వినోద్ కుమార్, కోర్స్ ఇన్‌చార్జి పరమేశ్వర్, విజయ్ కుమార్ స్థానిక పాఠశాల హెచ్‌ఎంలు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ తహసీల్దార్‌గా శ్రీకాంత్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను ఘనంగా సన్మానించారు. ముధోల్ మండలంలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించాలని కోరారు. రెవెన్యూ అధికారులకు సహకరిస్తామని పేర్కొన్నారు. తహసీల్దారుకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కోరి పోతన్న, పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేష్, నాయకులు తాటివార్ రమేష్, శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, దశరత్, విజేష్, మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మండలంలోని గిర్నూర్ గ్రామ సమీపంలోని శ్రీలక్ష్మి సాయి వైన్స్‌లో గుర్తుతెలియని దొంగలు శుక్రవారం తెల్లవారుజామున వైన్స్ షటర్లు పగలగొట్టి అందులో ఉన్న రూ.2లక్షల విలువ చేసే మద్యం, రూ.15 వేల నగదును చోరీ జరిగినట్టు వైన్స్ నిర్వాహకులు పాతేసింగ్ తెలిపారు. ఈ చోరీ విషయం పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఉదయం సీఐ రమేష్, స్థానిక ఎస్సై నరేష్‌తో వచ్చి పరిశీలించినట్టు నిర్వాహకులు తెలిపారు. డాగ్స్ స్క్వాడ్, క్లూస్ టీంతో తనిఖీలు చేయిస్తామని సీఐ రమేష్ తెలిపినట్టు వైన్స్ నిర్వాహకులు పాతేసింగ్ తెలిపారు. వైన్స్‌లో చోరీ జరగడం ఇదే మొదటిసారి అని అన్నారు. వైన్స్‌లో దొంగతనంపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ సాగించారు. వైన్స్ షాప్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని గడ్‌చాంద గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఎస్బీఐ ఆధ్వర్యంలో శుక్రవారం సైబర్ మోసాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ నుంచి ఓటీపీ వచ్చాయంటూ చేసే మోసాలను వినియోగదారులు గుర్తించాలని తెలిపారు. బ్యాంకు సంబంధిత వివరాలు ఇతరులతో పంచుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎల్‌డీఎం రాంగోపాల్, ఎస్సై సక్రియా నాయక్, సీఎఫ్ఎల్ సభ్యులు రాపర్తి వినయ్, మల్లేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి ఘన సన్మానం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని భాగపూర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి, బదిలీపై మండలంలోని పొట్పెల్లి (బి) పాఠశాలకు వెళుతున్న ఉపాధ్యాయుడు రాజారాంను శుక్రవారం గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో పేద విద్యార్థులకు చేయూతనందించి, పాఠశాల అభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర బాధ్యులు రాజేందర్, శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు అశోక్‌రెడ్డి, ఎంఈఓ చంద్రకాంత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని నారాయణ పాఠశాలలో బోనాల పండుగను శుక్రవారం వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నారులు వేసిన అమ్మవారి, పోతరాజుల వేషాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. నృత్యాలు చేస్తూ, బోనాలతో ఊరేగింపుగా పొచ్చమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఏజీఎం శివాజీ, వైస్ ప్రిన్సిపాల్ కోమల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-బోథ్

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్‌లో ఆదిలాబాద్ నియోజకవర్గంతో పాటు బోథ్ నియోజక వర్గానికి ఎటువంటి బడ్జెట్ కేటాయించకపోవడంతో శుక్రవారం బస్టాండ్ ఆవరణలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పతంగ్ బ్రహ్మానందం మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలోని కుప్టి ప్రాజెక్ట్‌తో పాటు జిల్లా అభివృద్ధికి ఎలాంటి బడ్జెట్ కేటాయించలేదని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బోరే రవీందర్, రైల్వే బోర్డు సభ్యుడు జీవి రమణ, సుభాష్ సూర్య, గులాబ్ సింగ్, మానాల శేఖర్, అశోక్‌రెడ్డి, జక్కుల వెంకటేష్, తుకారాం, విజయ్ పాల్గొన్నారు.